'బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డు'లకు ఎంపిక

శ్రీకాకుళం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌తో సహా పలువురు అధికారులకు 'బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డు-2024' పురస్కారాలు లభించాయి. జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఏఈఆర్వోగా శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.గణపతిరావు, బీఎల్‌వోలుగా ఐ.నీలవేణి (పలాస-పోలింగ్ స్టేషన్ 200), వంజరాపు జగన్నాథరావు(శ్రీకాకుళం-పోలింగ్ స్టేషన్ 161), టెక్నికల్ సపోర్ట్‌గా ఎం.సత్యనారాయణ ఈ అవార్డులకు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. వీరికి ఈనెల 25న ప్రభుత్వం పురస్కారాలను అందజేయనుంది.



శ్రీకాకుళంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, ఎమ్మెల్యే గొండు శంకర్, పార్టీ శ్రేణులు

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుక

- మెగా రక్తదాన శిబిరం నిర్వహణ

అరసవల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని కూటమి నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద తొలుత టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీఆర్, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏడురోడ్ల కూడలితోపాటు 80 అడుగుల రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టి.. సంబరాలు చేసుకున్నారు. మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తూ.. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యమిస్తూ.. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా, పార్టీ కోసం అహర్నిశలు పాటు పడుతున్న నిత్య కృషీవలుడు.. లోకేశ్ అని కొనియాడారు. ఏ ప్రాంతీయ పార్టీకి లేనివిధంగా టీడీపీలో కోటి మందికిపైగా సభ్యత్వ నమోదు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. 'యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయడం అభినందనీయం. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. పెద్దఎత్తున జాబ్‌మేళాలు నిర్వహించడం, అంతర్జాతీయ పారిశ్రామిక సదస్సులో రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువచ్చేందుకు లోకేశ్ చేసిన కృషి గొప్పది. యువగళం పాదయాత్ర ద్వారా సమస్యలను తెలుసుకుని.. ప్రస్తుతం ప్రజల జీవితాల్లో వెలుగు నింపడమే ధ్యేయంగా పని చేస్తున్నార'ని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, సీర రమణయ్య, మాదారపు వెంకటేష్, సింతు సుధాకర్, పాండ్రంకి శంకర్, రెడ్డి గిరిజాశంకర్, పోలిశెట్టి శ్రీనివాస్, కొమ్మనాపల్లి వెంకట రామరాజు, విభూది సూరిబాబు, ప్రధాన విజయరాం, కవ్వాడి సుశీల, ఏ.ప్రసాద్ పాల్గొన్నారు.

వసతి గృహాలకు మంచి రోజులు (6లో)

- మెస్ చార్జీలు, విద్యుత్తు బిల్లుల నిధులు విడుదల
- మౌలిక సదుపాయాలకు మరో రూ.1.73 కోట్లు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న బీసీ సంక్షేమ శాఖ



బొమ్మల్లో జీవకళ.. ఆయనకే సొంతమనేలా!

- విగ్రహాల తయారీలో ప్రత్యేక గుర్తింపు
- పర్యావరణ హిత గణేశుడితో రికార్డులు
- ఇదీ బైరి తిరుపతి విశిష్టత

6లో

రూ.30వేల కోట్లతో పవర్‌ప్లాంట్ నిర్మాణం

- 15వేల మందికి ఉపాధి: జెన్‌కో సీఈ

7లో

ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలి

- కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్

రహదారి భద్రతే.. జీవితానికి రక్షణ

- అందరూ నిబంధనలు పాటించాలి
- స్పీడ్ బ్రేకర్లను సత్వరం ఏర్పాటు చేయండి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

7లో



ఇవీ చౌకనే!



- రూ.వందల్లో ఉన్న నిత్యావసరాలు తక్కువ ధరకే ఇస్తారంట
- సాధ్యంకాని రేట్లతో అక్రమాలకు ఊతమిచ్చేలా అధికారుల చర్యలు
- 'సమగ్రశిక్ష' మూడో టెండర్‌లో బయటపడిన వ్యవహారం
- అన్నీ తెలిసినా మౌనం వహిస్తున్న కూటమి ప్రజాప్రతినిధులు

మార్కెట్‌లో మిరియాలు కిలో ధర సుమారు రూ.800 ఉంది. కానీ రూ.42కే సరఫరా చేస్తారంట. వెల్లుల్లి కిలో ధర రూ.225 ఉంటే.. కేవలం రూ.21కే ఇస్తారంట. అంతే కాదండోయ్.. మార్కెట్‌లో కిలో రూ.90 ఉన్న మెంతులు కారుచౌకగా రూ.11కే ఇచ్చేస్తారంట. ఇంక మినపపప్పు (బద్ద) అయితే మార్కెట్‌లో కిలో రూ.130 ఉంటే.. రూ.15కే అందజేస్తారంట. ఇంత తక్కువ ధరకు ఎలా సరఫరా చేస్తారని అనుమానం వస్తే.. టెండర్ వేసిన కాంట్రాక్టర్‌ను, వాటిని ఆమోదించిన జిల్లా అధికారులను ప్రశ్నించాలి మరి! అంతేకాదు.. అన్నీ తెలిసినా మిన్నకుండి పోతున్న కూటమి ప్రజాప్రతినిధులనూ అడగాలి మరి! 'సమగ్ర శిక్ష'లో జరిగిన ఈ యవ్వారం ఏంటో మీరే చదవండి.



శ్రీకాకుళంలో జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయం

శ్రీకాకుళం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 'సమగ్ర శిక్ష'లో టెండర్ల ధరలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఓ వైపు మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఏ వస్తువైనా కిలో రూ.100 నుంచి రూ.800లోపు పలుకుతోంది. కానీ, జిల్లాలోని కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థుల భోజనానికి అవసరమైన కూరగాయలు, నిత్యావసర వస్తువుల సరఫరాకు సంబంధించి కారుచౌకగా టెండర్లు వేయడం చర్చనీయాంశం అవుతోంది. రూ.20 నుంచి రూ.50లోపే వాటిని సరఫరా చేస్తామని టెండర్ దారుడు చెప్పడం.. అధికారులు సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా టెండర్లు ఖరారు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు కూటమి నేతలు కూడా మౌనం వహించడంతో పరోక్షంగా అక్రమాలకు ఊతమిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ధరలు ఇలా.. (కిలోలు.. రూపాయల్లో)

దినుసులు	టెండర్	మార్కెట్‌లో
మిరియాలు	42	800
మెంతులు	11	90
ఆవాలు	23	80
జీలకర్ర	36	270
పచ్చికొబ్బరి	11	180
ఎండుద్రాక్ష	22	180
ఎండుమిర్చి	30	180
మినపపప్పు (బద్ద)	15	130
పెసరపప్పు	18	125
వెల్లుల్లి	21	225

- జిల్లాలో 25 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, 13 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యార్థులకు భోజనం కోసం అవసరమయ్యే కూరగాయలు, కోడిగుడ్లు, పాలు, కోడిమాంసం తదితర నిత్యావసర వస్తువుల సరఫరాకు సంబంధించి 'సమగ్ర శిక్ష' ఆధ్వర్యంలో టెండర్లు ఖరారైపోయాయి. కాగా.. కేవలం రూపాయికే కొన్ని కూరగాయలు కిలోల లెక్కన సరఫరా చేస్తామని ఓ వ్యక్తి టెండర్ వేయడం.. దానిని అధికారులు ఖరారు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై ప్రజల్లో చర్చ సాగింది. అంత తక్కువ ధరకే టెండర్లు ఎలా ఖరారు చేస్తారని, అక్రమాలకు పాల్పడేలా అధికారులు సహకరించారని ఆరోపిస్తున్నారు. 'నవ్విపోదురు గాక.. మాకేమిటి' (మిగతా 6వ పేజీలో..)

ఇది ఫౌంటెయిన్ కాదు!



పలాస రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం టెక్కలిపట్నం - రేగులపాడు వద్ద తాగునీటి పైపులైను లీక్ అయి.. ఫౌంటెయిన్‌ను తలపిస్తోంది. సుమారు 20 అడుగుల పై ఎత్తుతో నీరు వృథా అవుతోంది. గురువారం ఉదయం నుంచీ లీకేజీ పెరగడంతో రహదారి అంతా జలమయమైంది. హిరమండలం నుంచి ఉద్దానం ప్రాంతంలో ప్రతీ గ్రామానికి పైపుల ద్వారా తాగునీటిని అందించేందుకు ప్రధాన కూడళ్ల వద్ద జంక్షన్లను ఏర్పాటు చేశారు. ఇవి సరిగా లేకపోవడం.. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో తాగునీరు వృథా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



డ్రా వివరాలు ప్రకటిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కేటాయించి.. రద్దు చేసి..

- గందరగోళంగా సుడా ప్లాట్ల వ్యవహారం
- తొలుత ఎమ్మెల్యే సమక్షంలో డ్రా ప్రక్రియ
- కొంతమందికి ప్లాట్లు దక్కకపోవడంతో ఆందోళన
- పరిస్థితి అదుపు తప్పడంతో రద్దు ప్రకటన
- మానవ తప్పులను కంప్యూటర్‌పై నెట్టిన సిబ్బంది
- అయోమయంలో దరఖాస్తుదారులు

శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సుడా) మొదటిసారిగా పలాస-కాశీబుగ్గలో ప్లాట్లకు వేసిన డ్రా ప్రక్రియ బెడిసికొట్టింది. అట్టహాసంగా ఎమ్మెల్యే గౌతు శిరీషతో కంప్యూటర్ ద్వారా డ్రా తీసి వివరాలు తొలుత ప్రకటించారు. ప్లాట్లు కేటాయించారు. అనంతరం కొంతమంది ఉద్యోగులకు ప్లాట్లు దక్కకపోవడంతో వారు అధికారులను నిలదీశారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. చివరకు కంప్యూటర్‌లో కొన్ని పొరపాట్లు వల్ల నిబంధనల మేరకు డ్రా తీయలేకపోయామని, ఈ ప్రక్రియ రద్దు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. మరికొద్దిరోజుల్లో మళ్లీ డ్రా తీసి ప్లాట్లు కేటాయిస్తామని ప్రకటించారు. దీంతో దరఖాస్తుదారులు అయోమయం చెందారు. సుడా సిబ్బంది చేసిన తప్పులను.. కంప్యూటర్‌పై నెట్టేశారని ఆరోపించారు.

పలాస, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సుడా) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్లాట్ల కేటాయింపు వ్యవహారం గందరగోళంగా సాగింది. పలాస-కాశీబుగ్గలో ప్రజలు, ఉద్యోగుల కోసం సుడా అధికారులు మొదటిసారిగా పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో జాతీయరహదారికి ఆనుకుని మొత్తం 150 ఎకరాల భూమిని రైతుల వద్ద కొనుగోలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న టౌన్‌షిప్ పేరుతో కొనుగోలు చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ లేఅవుట్ పేరుతో దాన్ని అభివృద్ధి చేసింది. 80 అడుగుల ప్రధాన రహదారితో పాటు లోపల 30 అడుగుల వెడల్పుతో రహదారులు, పార్కులు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సుడా ప్రకటించింది. తొలుత 50ఎకరాల్లో ప్లాట్లు విక్రయానికి పెట్టింది. 250 ప్లాట్లను డ్రా ద్వారా కేటాయించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే గౌతు శిరీష, జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, సుడా చైర్మన్ ఎస్.రవికుమార్‌తో పాటు సుడా అధికారులు, లేఅవుట్ అభివృద్ధి ఇంజనీరింగ్ సిబ్బంది, దరఖాస్తుదారులు హాజరయ్యారు. ఎమ్మెల్యేతో కార్యక్రమం ప్రారంభించిన అనంతరం మొత్తం 12 మందికి డ్రా ద్వారా ప్లాట్లు కేటాయించారు. ఇదిలా ఉండగా 242 చదరపు గజాలకు సంబంధించి డ్రాలో ఉద్యోగులు ఎక్కువగా దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు డ్రాలో వారికి స్థలాలు రాకపోతే జనరల్ కేటగిరిలో వారికి కేటాయించాల్సి ఉంది. ఆ విధంగా చేయకుండా డ్రాలో వచ్చినవారికి ప్లాట్లు కేటాయించి మిగిలిన దరఖాస్తుదారులకు నగదు తిరిగి ఇస్తామని ప్రకటించడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గందరగోళపరిస్థితికి దారితీసింది. దీనికి సంబంధించిన నిబంధనలు కంప్యూటర్‌లో క్రోడీకరించకపోవడంతో అప్‌డేట్ అవ్వలేదు. దీంతో స్థలాలు రాని వారికి రద్దు చేసినట్లు రావడంతో ఆందోళన వ్యక్తమైంది. జరిగిన తప్పును సుడా సిబ్బంది గుర్తించి కంప్యూటర్‌పై మొత్తం (మిగతా 6వ పేజీలో..)



డ్రాలో పొరపాట్లు జరిగాయంటూ ఆందోళన చేస్తున్న దరఖాస్తుదారులు

బొమ్మల్లో జీవకళ.. ఆయనకే సొంతమనేలా!

- విగ్రహాల తయారీలో ప్రత్యేక గుర్తింపు
- పర్యావరణ హిత గణేశుడితో రికార్డులు
- ఇదీ బైరి తిరుపతి విశిష్టత

కవిటి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వస్తోందంటే ఉద్దానం వాసుల దృష్టి ఓ ఊరిపై నిలుస్తుంది. ఆ ఊరిలోని ఓ కళాకారుడిపై నిలుస్తుంది. ఆయన ఆలోచన వినాయకుడికి ఏ రూపమిస్తుందోననే ఉత్సుకతను కలిగిస్తుంది. ఆ ఊరి పేరు కవిటి మండలంలోని బొరివంక. ఆ కళాకారుడి పేరు బైరి తిరుపతి. చిత్రకళపై ఆసక్తితో సొంతంగా సాధన చేసి... జీవనోపాధిగా మలుచుకొని... తాను గుర్తింపు పొందడమే కాకుండా పది మందికి ఉపాధి కల్పిస్తున్నాడు తిరుపతి. ప్రస్తుతం ఉద్దానంలోని ఏ గ్రామంలో ఆలయాలు నిర్మించినా... గ్రామ ముఖ ద్వారాలు నిర్మించినా... అక్కడ బైరి తిరుపతి చేతిలో రూపుదిద్దుకున్న ఒక్క దేవతా చిత్రమైనా ఉండాల్సిందే. ఈ క్రమంలో అనేక రివార్డులు, రికార్డులు సొంతం చేసుకున్నాడు. సేవా కార్యక్రమాల్లోనూ ముందు ఉంటున్నాడు.




రికార్డుల ధ్రువపత్రాలతో తిరుపతి



రాజపురంలో గౌతు లచ్చన్న విగ్రహం రూపకల్పనలో..

చిన్నతనం నుంచే ఆసక్తి..

తిరుపతికి చిన్నతనం నుంచే చిత్రకళపై ఆసక్తి ఉండేది. కాగితాలపై బొమ్మలు వేయడం... సబ్బులపై శిల్పాలు చెక్కడం వంటివి చేసేవాడు. పదో తరగతి చదువుతున్న సమయంలో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. కుటుంబ బాధ్యతలను మోయాల్సి వచ్చింది. దీంతో ఉపాధి కోసం విశాఖపట్నం వెళ్లిపోయాడు. అక్కడ సిమెంటు బొమ్మల తయారీలో శిక్షణ పొందాడు. విగ్రహాలు తయారు చేయడంలో పట్టు సాధించాడు. కొన్నాళ్ల తరువాత స్వగ్రామానికి చేరుకున్నాడు. అప్పటి నుంచి గ్రామంలోనే ఉంటూ తన కళకు పదును పెట్టాడు. ప్రతిభతో గుర్తింపు పొందాడు. అంతకుముందు ఉద్దానంలోని ఆలయాల వద్ద ఇతర ప్రాంతాల శిల్పులు బొమ్మలు వేసేవారు. కానీ తిరుపతి ప్రతిభను మెచ్చుకొని ఈ ప్రాంతీయులు ఆయనకు అవకాశాలు కల్పించడం మొదలు పెట్టారు. దేవతా విగ్రహాలతో పాటు దేశనేతల విగ్రహాల తయారీలోనూ ప్రశంసలు అందుకుంటున్నాడు. ఇప్పుడు పది మందికి ఇదే కళలో శిక్షణ ఇస్తూ.. ఉపాధి కల్పిస్తున్నాడు. మరోవైపు ఇళ్లు, ఆలయాలకు పెయింటింగ్స్ వేయడం ద్వారా పేరు సంపాదిస్తున్నాడు. పుట్టపర్తి వంటి ప్రదేశాల్లో కూడా బొమ్మలు తయారు చేసి పలువురి మన్ననలు పొందాడు.



సేవా కార్యక్రమాల్లోనూ...

సమాజ సేవా కార్యక్రమాల్లోనూ తిరుపతి ముందు ఉంటున్నాడు. వివిధ సందర్భాల్లో అవసరమైన వారికి తనవంతు సహాయాన్ని అందిస్తుంటాడు. ఏటా పుట్టపర్తిలోని సాయి ఆశ్రమంలో సేవ చేసేందుకు వెళుతుంటాడు. మరోవైపు సంగీత కళలోనూ ప్రతిభ చూపించే ప్రయత్నం చేస్తున్నాడు.

రికార్డుల్లో నమోదు..

విగ్రహాల తయారీలో పట్టు సాధించిన తిరుపతి తమ గ్రామానికి పేరు తెచ్చేలా ఏదో ఒకటి చేయాలనే ఆలోచనలో పడ్డాడు. అదే సమయంలో బొరివంక గ్రామంలో ఉద్దానం యూత్ క్లబ్ స్థాపించటంతో వారి సహకారంతో వినాయక చవితిని దీనికి వేదికగా మార్చుకున్నాడు. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నాడు. 2012లో స్థానికంగా లభ్యమయ్యే కొబ్బరి కాయలను ఎంచుకున్నాడు. వాటితోనే నారికేళ వినాయకుని విగ్రహాన్ని తయారు చేసి ప్రశంసలు అందుకున్నాడు. అదే స్ఫూర్తితో 2013లో నలుగు పిండితోను, 2014లో వరి విత్తనాలతో వరి నారు వినాయకుని రూపొందించాడు. 2015లో వనమూలికలతో విగ్రహాన్ని తయారు చేశాడు. 2016లో పామాయిల్ కాయలతో, 2017లో గోధుమ నారుతో, 2018లో కొబ్బరి పువ్వులతో, 2019లో సుద్దముక్కలతో లేఖినీ రూప గణపతికి రూపమిచ్చాడు. 2020లో పల్లకీ గణపతులను తయారు చేశాడు. 2021లో నల్ల జీడిపిక్కలతో విగ్రహాన్ని సిద్ధం చేశాడు. 2022లో ఆవాలుతో, 2023లో పసుపు కొమ్ములతో, 2024లో పెసర నారుతో గణపతి విగ్రహాలను రూపొందించాడు. పర్యావరణానికి మేలు చేసే విధంగా స్థానికంగా లభ్యమయ్యే వస్తువులను చవితికి నెలరోజుల ముందు సేకరించి.. వాటితో విగ్రహాలను తయారు చేయడం తిరుపతి ప్రత్యేకత. తాను రూపొందించిన గణపతి విగ్రహాలకు గాను 2013లో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. 2019లో ఆరునెలల పాటు శ్రమించి రాత్రి వేళలోనే 3,500 సుద్దముక్కలతో తయారు చేసిన విగ్రహంతో గిన్నిస్ బుక్ రికార్డులలోనూ చోటు దక్కించుకున్నాడు. ఏటా తయారు చేసే విగ్రహాలతో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు, వండర్, చాంపియన్, హైరేంజ్ బుక్ ఆఫ్ రికార్డులలోనూ స్థానం పొందాడు. కొన్ని సాంస్కృతిక, సేవా సంఘాల నుంచి పురస్కారాలను అందుకున్నాడు.

ఇవీ చౌకనే!

(ఐదో పేజీ తరువాయి)

అన్న రీతిలో అధికారులు వ్యవహరించగా.. వాస్తవాలు తెలిసీ కూటమి నేతలు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మూడో టెండర్‌లో వంట సామగ్రి దినుసులు (గ్రాసరీస్) ధరల జాబితా అగ్రిమెంట్ కూడా విడుదలైంది. మార్కెట్‌లో ఒక్కో సరుకు ధర కిలో రూ. వందల్లో ఉండగా.. అవి కూడా రూ.20 నుంచి రూ.50లోపు సరఫరా చేస్తామని ఓ వ్యాపారి టెండర్ వేయగా.. అధికారులు ఖరారు చేయడం మరోసారి చర్చకు దారితీసింది.

● నిబంధనల ప్రకారం.. అతి తక్కువ ధరకు కోట్ చేసిన వారికే టెండర్ ఖరారు చేస్తారు. అయితే మార్కెట్‌లో వందల్లో ఉన్న సరుకుల ధరలు.. రూ.20కే ఇస్తామంటే అది సాధ్యపడుతుందా అన్నది అధికారులు యోచించలేదు. జాబితాలో ఉన్న దినుసులు టెండర్ ప్రకారం వారానికి ఒకసారి సరఫరా చేసినా నష్టం అంతా ఇంతా కాదు. బయట మార్కెట్ ధరలు అలా ఉన్నాయి. దీనికి తోడు.. రవాణా చార్జీలు కూడా భరించుకోవాలి. కాగా.. ఉన్నత అధికారులను.. మండల స్థాయిలో కేజీబీవీలు, మోడల్ స్కూల్ అధికారులను తమకు అనుకూలంగా మార్చుకుంటే పని సులభతరమవుతుందని.. కాగితాల్లో సరుకులు సరఫరా చేసినట్లు పక్కాగా చూపించుకుంటే బిల్లుల చెల్లింపులు జరిగిపోతాయనేది అటు వ్యాపారి భావన. నిత్యావసరాలు నిబంధన ప్రకారం 36 రకాల దినుసులు సరఫరా చేయాలి. ఇందులో పప్పు, ఉప్పు, పోపుల సామగ్రి, బిస్కెట్‌లు.. ఇలా చాలానే ఉన్నాయి. ఇందులో అత్యధిక దినుసులు టన్నులలో కొనుగోలు చేసినా తగ్గింపు లభించని ధరలు.. టెండర్‌లో మాత్రం తక్కువకే ఇస్తున్నామని అంగీకారం తెలపడం.. అధికారులు ఒప్పందం కుదుర్చుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఓ పది రకాల నిత్యావసరాల ధరలు మొత్తం రూ.2,260 ఉండగా... ఖరారైన టెండర్‌లో కేవలం రూ.229కే వర్తించేలా ధరలు ఉన్నాయి. ఇది వింతా?.. విడ్డూరమా?... లేదా అక్రమానికి అంగీకారమా? అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తనిఖీలు చేస్తారా?

సాధ్యపడని ధరలకు టెండర్లు ఇచ్చేసి.. అధికారులు మమ అనిపించుకుంటే విద్యార్థులకు నాణ్యమైన భోజనం దక్కదనే వాదనలు వినిపిస్తున్నాయి. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించే బిల్లుల వ్యవహారం సమగ్రంగానే ఉంటుందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిబంధనల ప్రకారం జిల్లాలో కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో భోజన నిర్వహణ సక్రమంగా సాగుతుందో.. లేదోనన్నది అధికారులు పరిశీలించాలి. టెండర్ల ప్రకారం నిత్యావసర వస్తువులు సక్ర మంగా సరఫరా చేస్తున్నారా? లేదోనని తనిఖీలు చేయాలి. వారానికి ఒకసారైనా అధికారులు తనిఖీలు చేస్తే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందు తుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మౌనం దాల్చిన కూటమి నేతలు..

జిల్లాలో జరుగుతున్న సంఘటనలను పత్రికలు, ఇతర సమాచార వ్యవస్థల ద్వారా ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటుంటారు. అనుకూల, ప్రతికూల వార్తలపై సమయానుకూలంగా స్పందిస్తుంటారు. కానీ 'సమగ్ర శిక్ష'లో చవక టెండర్లు బాగోతంపై స్పందించకపోవడం అన్యాయమని, అక్రమాలకు పరోక్షంగా సహకరిస్తున్నారని జిల్లావాసులు ఆరోపిస్తున్నారు. చవకగా సరుకులు ఇస్తామంటే.. నాణ్యత అనుమానమే అన్నది బయటపడుతున్నా.. ఆవిషయంతో తమకు సంబంధంలేదన్నట్లు కూటమి నేతలు మౌనం వహిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. గత మూడేళ్లగా టెండరు పొందిన వ్యక్తే.. ఈ దఫా కూడా కూరగాయల టెండరును దక్కించుకున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాలకు సబ్‌కాంట్రాక్టులను కూడా ఇచ్చేశారు. ఆ ప్రాంతంలోని కేజీబీవీలు, ఆదర్శ పాఠ శాలలకు కూరగాయలు సరఫరా చేసు కోవాలని సబ్ కాంట్రాక్టును కొందరి ఎమ్మెల్యేల సమక్షంలో స్థానిక వ్యక్తులకు ఇచ్చేయడం కొసమెరుపు. ప్రస్తుతం 3 నియోజకవర్గాల్లో సబ్‌కాంట్రాక్టు జరిగిపోయింది. రాష్ట్ర ప్రభుత్వంలో పెద్దలకు ఈ విషయం చేరకముందే స్పందించి విద్యార్థులకు న్యాయం.. నాణ్యతతో కూడిన భోజనం అందేలా నిఘా ఉంచితేచాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు మౌనాన్ని వీడుతారా.. లేదా ఉన్నత అధికారులపై నెపం నెట్టేసి పైకి మాత్రం తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తారా అన్నది వేచి చూడాల్సిందే.

కేటాయించి.. రద్దు చేసి..

(ఐదో పేజీ తరువాయి)

తప్పులను నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేశారు. డ్రా తీసిన మొత్తం ప్లాట్లన్నీ రద్దు చేస్తున్నామని, వందల సంఖ్యలో ప్లాట్లు ఉన్న కారణంగా దరఖాస్తు చేసుకున్నవారందరికీ కేటాయిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో వారంతా శాంతించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే శిరీషతో వేదిక కిందే అరకొర వసతుల మధ్య డ్రా తీయించారని పలువురు పేర్కొన్నారు. జేసీ చొరవ చూపడంతో తర్వాత వేదికపైకి ఎక్కినా.. అక్కడ టేబులు లేక.. ల్యాప్‌టాప్‌ను చేతిలో పట్టుకుని ఎమ్మెల్యే డ్రా తీయాల్సి వచ్చిందని అసహనం చెందారు. జిల్లాలో మొదటిసారిగా సుడా ప్లాట్ల విక్రయానికి శ్రీకారం చుట్టగా ఎంతో సమయస్ఫూర్తి, చాకచక్యంతో కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా దీనిపై అవగాహన లేని సిబ్బంది. అధికారుల తప్పుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు రావడంతో కూటమి నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే అసహనం..

డ్రాపై అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయలేకపోయారని, స్థలాలు కేటాయింపులో కూడా అధికారులకు అవగాహన లేకపోతే ఎలా? అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అసహనం వ్యక్తం చేశారు. కనీసం ఎమ్మెల్యేకు స్వాగత ఏర్పాట్లు కూడా తూతూ మంత్రంగా అధికారులు నిర్వహించడంపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, ఎం.నరేంద్ర, సప్ప నవీన్, కోట్ని దుర్గాప్రసాద్, మల్లా శ్రీనివాస్, కరికాన శంకర్, టంకాల రవిశంకర్‌గుప్తా పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను జిల్లాలోని టీడీపీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కేకులు కట్ చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. అన్న దానం చేశారు. లోకేశ్ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



పలాస రూరల్: పలాసలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



నరసన్నపేట: టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



ఆమదాలవలస: రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూన రవికుమార్



పాతపట్నం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



కవిటి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్



రణస్థలం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు



నరసన్నపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహం

వసతి గృహాలకు మంచి రోజులు

- మెస్ చార్జీలు, విద్యుత్ బిల్లులకు నిధులు విడుదల
- మౌలిక సదుపాయాలకు మరో రూ.1.73 కోట్లు
- పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న బీసీ సంక్షేమ శాఖ

నరసన్నపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వసతి గృహాలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మరోవైపు ఎన్నో నెలలుగా బకాయి ఉన్న ఇంటర్నెట్, ఇతర బిల్లులతో పాటు మెస్ చార్జీలను వసతిగృహాల అధికారుల ఖాతాల్లో జమ చేసింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి చెల్లించాల్సిన మెస్ చార్జీలను ఒకేసారి విడుదల చేసింది. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలపైనా దృష్టి సారించింది. 50 వసతి గృహాల భవనాల మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.73 కోట్లు మంజూరు చేసింది. వీటితో వసతి గృహాలలో విద్యుత్ పనులు, తాగునీరు, కిటికీలకు మెస్‌లు, తలుపులు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల సౌకర్యాల మెరుగు, బాలికల వసతిగృహాల్లో ప్రహరీల నిర్మాణం వంటివి చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలకు ఈ పనుల బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలకు కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

జిల్లాలో ఇలా...

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతి గృహాలు 79 ఉన్నాయి. వీటిలో సుమారు 7,100 మంది విద్యార్థులు ఉంటున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 30 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 2,812 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.1250 నుంచి గరిష్ఠంగా రూ.1600 వరకు మెస్ చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుంది. వీరికి కేవలం బియ్యం మాత్రమే ప్రభుత్వం నెలనెలా పంపిణీ చేస్తుంది. మిగతా కిరాణా సామగ్రి, చికెన్, గుడ్లు కొనుగోలు చేసి విద్యార్థులకు పెట్టేవారు. ఈ నేపథ్యంలో గత ఏడాది జూన్ నుంచి వసతి గృహాల బిల్లులను సుమారు రూ. 6 కోట్ల వరకు ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో పాటు ఒక్కొక్క వసతి గృహానికి ఇంటర్నెట్ బిల్లు రూ.15 వేల నుంచి రూ.21 వేల వరకు, ఇతర మరమ్మతులకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రభుత్వం విడుదల చేసింది.

పనులకు ప్రతిపాదించాం



బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.1.73 కోట్లు విడుదల చేసింది. ప్రాధాన్యం మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదానికి పంపించాం. పూర్తి స్థాయిలో రన్నింగ్ వాటర్ సదుపాయం, వర్షాలకు శ్లాబ్‌లు లీక్ కాకుండా పనులు, కిటికీలు, తలుపులు బాగు చేయడంతో పాటు మరుగుదొడ్ల మరమ్మతులకు ప్రతిపాదించాం. మార్చిలోగా పనులు పూర్తి చేస్తాం.

- అనురాధ, బీసీ సంక్షేమ శాఖ అధికారి

గణతంత్ర ఉత్సవాలకు కవిటి సర్పంచ్‌కు ఆహ్వానం



కవిటి సర్పంచ్ లక్ష్మణరావు

కవిటి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకలలో పాల్గొనేందుకు కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పి.లక్ష్మణరావుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి వీరభద్రస్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మన రాష్ట్రం నుంచి 25 మంది సర్పంచ్‌లకు ఆహ్వానం అందగా... శ్రీకాకుళం జిల్లా నుంచి కవిటి సర్పంచ్‌కు మాత్రమే అవకాశం వచ్చిందని వెల్లడించారు. పంచాయతీలో ఆరు అంశాల అమలు తీరును ప్రాతిపదికగా చేసుకొని సర్పంచ్‌లను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పి.లక్ష్మణరావు విలేకరులతో మాట్లాడుతూ ఈ అవకాశం రావడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఈ గౌరవం పంచాయతీ ప్రజలకు దక్కుతుందని అన్నారు.

జ్ఞానదానమే నిజమైన యజ్ఞం



యాగశాలను ప్రారంభిస్తున్న స్వామిజీ

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జ్ఞానదానమే నిజమైన యజ్ఞమని గణపతి సచ్చిదానందస్వామి అన్నారు. గురువారం కొత్త బ్రిడ్జి వద్ద ఉన్న గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆలయాన్ని సందర్శించి.. మహా గణపతి హోమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యను సంతోషంగా స్వీకరించినప్పుడే విజయవంతంగా పరిష్కరించగలమని చెప్పారు. సమాజ సంక్షేమానికి త్యాగం పునాది వంటిదన్నారు. సామాన్యుడిని దేవుని వద్దకు చేర్చడమే సర్వమత సారాంశమని చెప్పారు. క్రియా యోగం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని ఆయయన తెలిపారు. సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఎలా చూసుకోవాలన్న అంశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసి ఉందన్నారు. ఆలయంలో నూతన యాగశాల, కళా వేదికలను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట దత్త విజయానంద తీర్థస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, గవర విజయరాజు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి డాక్టర్ ప్రవీణ్ పుల్లట


ప్రవీణ్ పుల్లట

శ్రీకాకుళం క్రైం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రైజ్ (ఆర్ఐఎస్ఈ) సీఈవో డాక్టర్ ప్రవీణ్ పుల్లటకు అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయన పేరు నమోదైంది. రాజకీయ విశ్లేషకునిగా, సెఫాలజిస్ట్‌గా ఎదిగిన ప్రవీణ్.. తెలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై విడుదల చేసిన సర్వే నివేదిక 99 శాతం నిజమైంది. ఏపీ ఎన్నికల్లో 62 మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీల విజయం కోసం పనిచేసి 18వేల పేజీలకు పైగా డేటా అనలిటిక్స్ అందించిన రైజ్ ప్రవీణ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే చరిత్ర పుటల్లోకి ఎక్కారు. ఓ తెలుగు రాజకీయ వ్యూహకర్తగా తనకు గుర్తింపు లభించడం విశేషమని.. అరుదైన గౌరవంగా భావిస్తున్నానని ప్రవీణ్ ఈ సందర్భంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 19న దుబాయిలో జరిగే కార్యక్రమంలో ఈ రికార్డు అందుకోనున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన కేవలం 30 మంది మాత్రమే లండన్ పార్లమెంట్ ఆహ్వానం మేరకు ఈ అవార్డు మహోత్సవానికి హాజరువుతున్నట్టు స్పష్టం చేశారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం


రూ.లక్ష చెక్కును అందిస్తున్న దాతలు

అరసవల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని నగరానికి చెందిన పాలిశెట్టి గౌరమ్మ దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి రూ.1,01,000 చెక్కును ఆలయ సూపరింటెండెంట్ కనకరాజుకు అందజేశారు. వారిని ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆశీర్వదించగా, ఆలయ సూపరింటెండెంట్ స్వామివారి జ్ఞాపికను అందజేశారు. అలాగే స్వామివారిని ఏపీ ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్ మువ్వ పద్మ దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈవో వై.భద్రాజీ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఉపాధి కల్పించే సబ్జెక్టులు ప్రవేశపెట్టాలి

గుజరాతీపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలున్న సింగిల్ మేజర్ సబ్జెక్టులను ప్రవేశపెట్టాలని కమిటీ సభ్యులు సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం అకడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ వర్సిటీ నుంచి అకడమిక్ అఫైర్స్ డీన్ కె.స్వప్న వాహిని, ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌భాస్కర్, ఎం.అనురాధ కమిటీ సభ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశ్నా పత్రాల్లో మార్పులు, సింగిల్ మేజర్ కోర్సులకు సంబంధించిన సిలబస్, ఇంటర్నల్ ఎగ్జామినేషన్ ప్రణాళికలు, బ్లూ ప్రింట్ తదితర అంశాలపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కె.మౌనిక సెక్రటరీగా వ్యవహరించగా, వివిధ రంగాల నుంచి నటుకుల మోహన్, వాన కృష్ణచంద్, బరాటం సూరజ్, కె.సుధా సభ్యులుగా పాల్గొన్నారు.

విలీనంపై పునరాలోచన చేయండి

ఇచ్ఛాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విలీనంపై పునరాలోచించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు అన్నారు. గురువారం బాలికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ మున్సిపల్ అధ్యక్షుడు బి.ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల విలీనం సరికాదని 60రోల్ దాటిన ప్రతీ పాఠశాలను మోడల్ ప్రైమరీగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సంఘ మండల, అర్బన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ప్రకాష్, సాయి, శ్రీనివాస సాహు, సంతోష్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు పాపారావు, దామోదర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

కవిటి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. శిలగాం పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ పాలనలో గ్రామాలను పట్టించుకోవడం మానేశారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్, జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, రైల్వే మెంబరు రంగారౌళో, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బి.చిన్నబాబు, బి.రమేష్, బి.మారావురౌళో, సర్వేశ్వరరావు కాళీప్రసాద్ ఉన్నారు.

మంచు కేర్ ఆస్పత్రిలో చోరీ

శ్రీకాకుళం క్రైం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇలిసిపురం నుంచి బొందిలీపురం వెళ్లేదారిలో ఉన్న మంచు కేర్ ఆస్పత్రిలో గురువారం వేకువజామున చోరీ జరిగినట్టు వైద్యులు వాసుదేవరావు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో తలుపులు విరగొట్టి చొరబడి క్యాబిన్ డస్కులో ఉన్న రూ.లక్ష నగదు, హార్డ్ డిస్కులు దొంగలించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు.

మందుల దుకాణాల్లో తనిఖీ

ఆమదాలవలస, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మందుల దుకాణాలను గురువారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆశోషేక్ తనిఖీ చేశారు. ఆ శాఖ ఉద్యోగి నుంచి ముందస్తు సమాచారం అందుకోవడంతో పట్టణంలోని పలు మందుల దుకాణాలను మూసివేశారు. పట్టణంలో ఉన్న రెండు అపోలో ఫార్మసీ దుకాణాలు తనిఖీ చేశారు. ఇది కూడా ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేసినట్టు సమాచారం.

అండగా ఉంటాం

బూర్జ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటామని వైసీపీ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ అన్నారు. మదనాపురంలో పార్టీ కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. కార్యకర్తలంతా ఏకతాటిపై నడవాలన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

నగరం నడిబొడ్డునే ఇలా..

- అధ్వానంగా రహదారులు
- కానరాని కనీస వసతులు
- అవస్థలు పడుతున్న ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీవాసులు

అరసవల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరం నడిబొడ్డున ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీ ఉంది. ఆ కాలనీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. అన్ని అప్రూవల్స్‌తో ప్రణాళికా బద్ధంగా నిర్మాణం జరిగిన వీధులు. పన్నులు కూడా నగర పాలక సంస్థకి సకాలంలో కాలనీవాసులు చెల్లిస్తున్నారు. కానీ కనీస సౌకర్యాలకు కూడా నోచుకోక ఆ కాలనీవాసుల పరిస్థితి వర్ణణాతీతం. ముఖ్యంగా రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షా కాలంలో బయటకు రావాలంటే నరకయాతన పడుతున్నారు. నగరం మధ్యలో ఉన్న కాలనీకే ఈ దుస్థితి పట్టడంపై వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేపోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి కాలనీలోని రోడ్లను బాగు చేయాలని వారంతా కోరుతున్నారు.


గుంతలతో అధ్వానంగా తయారైన ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీ రోడ్డు

మురుగు సమస్య పరిష్కరించాలి



ఎన్నో ఏళ్లగా కాలనీలో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. రోడ్డుకు కేవలం 100 అడుగుల దూరంలోనే ప్రధాన మురుగునీటి కాలువ ఉంది. డ్రైనేజీ వ్యవస్థను దానికి కనెక్ట్ చేస్తే కాలనీవాసుల ఇబ్బందులు తీరిపోతాయి. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలి.

- కుప్పిలి రామకృష్ణారావు, కాలనీవాసి (రిటైర్డు ఆర్ అండ్ బీ ఉద్యోగి)

విన్నవించినా ఫలితం లేదు



కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఎన్నోసార్లు అధికారులను కలిసి విన్నవించాం. పరిష్కరిస్తామన్నారే తప్ప ఇంతవరకు ఎటువంటి చర్యలు లేవు. రోడ్డుపై నడవడానికి కూడా ఇబ్బందిపడే పరిస్థితి. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణం. ఇప్పటికైనా పాలకులు మా కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి.

- దంతం సత్యనారాయణ, కాలనీవాసి (రిటైర్డు బ్యాంకు మేనేజర్)

రోడ్లపైనే మురుగునీరు

కాలనీ ఏర్పడిన తర్వాత సరైన కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో చిన్నాపాటి వర్షం కురిసినా మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.30 వేల కోట్లతో పవర్ ప్లాంట్ నిర్మాణం

- 15వేల మందికి ఉపాధి
- జెన్‌కో సీఈ సురేష్‌బాబు


జెన్‌కో బృందంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస నియోజకవర్గం సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో రూ.30వేల కోట్లతో ఏపీ జెన్‌కో పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనున్నట్టు ఆ సంస్థ సీఈ జి.సురేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 3,200 మెగావాట్స్ ఉత్పత్తిచేసే పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనుందని, ఇందులో భాగంగా అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశామన్నారు. రానున్న రెండేళ్లలో రూ.15 వేల కోట్ల చొప్పున వెచ్చించి రెండు దశల్లో పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. దీని ద్వారా సుమారు 15 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

స్థలం పరిశీలన

సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో పవర్‌ప్లాంట్ నిర్మాణానికి అనుకూలంగా ఉన్న ప్రాంతాన్ని గురువారం ఏపీ జెన్‌కో బృంద సభ్యులు పరిశీలించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్, జెన్కో సీఈ వై.సురేష్‌బాబు, ఎస్ఈలు జి.రామకృష్ణనాయుడు, డి.కృష్ణారావు, ఈఈలు జి.వాసుదేవరావు, బి.చలపతిరావులతో సరుబుజ్జిలి తహసీల్దార్ కార్యాలయంలో శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష సమీక్షించారు. అనంతరం వెన్నెలవలస, లక్ష్మీపురం, శ్రీరాంవలస గ్రామలతో పాటు బూర్జ మండలం బొడ్లపాడు, అడ్డూరిపేట, జేవీ పురం, సోమిదవలస, గోపీదేవిపేట గ్రామాల్లో సుమారు 1600 ఎకరాల భూములు పవర్ ప్లాంట్ నిర్మాణానికి అనుకూలంగా ఉన్నట్టు బృందం గుర్తించిందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. వంశధార జలాశయం నుంచి వంశధార, నాగావళి నదుల అనుసంధాన హెచ్ఎల్‌సీ కాలువతో నీటి అనుకూలత ఉంటుందని, వెన్నెలవలస మినీ జలాశయం కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ పవర్ ప్లాంట్ దోహదపడుతుందన్నారు. తహసీల్దార్లు మధుసూదన్, ఈశ్వరమ్మ, టీడీపీ నాయకులు శివ్వాల సూర్యనారాయణ, ఆనెపు రామకృష్ణనాయుడు తదితరులు ఉన్నారు.

ఏకసభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్


మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

అరసవల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను చేపట్టి కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు మానుకోవాలని, వర్గీకరణ కోసం నియమించిన ఏకసభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ నయకుడు, కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. నగరంలోని స్థానిక ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఓబీసీలు ఉన్నారని, కానీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటివరకు ఓబీసీలు ఎందుకు ముఖ్యమంత్రి కాలేకపోయారని ప్రశ్నించారు. ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేసి ఎస్సీలను విభజించే పనిని ఆపకుంటే రాష్ట్రంలో ఎస్సీ ఓబీసీలను ఏకతాటి పైకి తీసుకొస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్నదని, అటువంటి సంస్థకు కేవలం రూ.11400 కోట్లు ఇస్తే ఏం సరిపోతుందని ప్రశ్నించారు. అమరావతి నిర్మాణానికి వేలకోట్ల రూపాయలు అప్పులు చేసి అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తుండడం సరికాదన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా రాజధాని నిర్మాణానికి, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంటు తెచ్చుకోవాలన్నారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రపంచంలోని ధనిక రాజకీయ నాయకుల్లో ప్రథమ స్థానంలో ఉన్నాడన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.షన్ముఖరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి లఖినేని నారాయణరావు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై తనిఖీలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆమదాలవలస, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జోరుగా సాగుతున్న గంజాయి రవాణాపై ఎస్ఐలు సనపల బాలరాజు, బి.షైమావతి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. గురువారం పట్టణంలో డాగ్ స్క్వాడ్‌తో రైల్వేస్టేషన్ (శ్రీకాకుళం రోడ్డు)లో ప్రయాణికులు లగేజీ బ్యాగ్‌లతో పాటు రైల్వేస్టేషన్ ఆవరణలోని షాపుల్లో సోదాలు చేశారు. పట్టణంలోని కొన్ని ప్రాంతాలతో పాటు సీఎస్‌పీ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సులు, వివిధ వాహనాలను తనిఖీ చేశారు. గాజులకొల్లివలస పరిధిలో ఉన్న సంగమేశ్వరస్వామి కొండ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో పరిశీలించారు.

రహదారి భద్రతే.. జీవితానికి రక్షణ

- అందరూ నిబంధనలు పాటించాలి
- స్పీడ్ బ్రేకర్లను సత్వరం ఏర్పాటు చేయండి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రహదారిపై ప్రయాణించే ప్రతీ ఒక్కరూ భద్రతా నిబంధనలు పాటించాలని, రహదారి భద్రతే జీవితానికి రక్షణ అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో 36వ జాతీయ రవాణా భద్రతా మాసోత్సవాలు, రహదారుల భద్రతా సమన్వయం కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జిల్లాలో అనేకచోట్ల రోడ్డు భద్రతపై వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రధాన కూడళ్లలో ఉన్న రహదారులు, సర్వీసు రోడ్లు, స్పీడ్ బ్రేకర్స్ తదితర అంశాలపై ఆరా తీశారు. రోడ్డు భద్రతా చర్యలపై ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని, రోడ్డుపై మార్కింగ్, సైన్ బోర్డులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఉప రవాణా కమిషనర్ విజయసారధి, ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ వివేకానంద, డీపీవో భారతి సౌజన్య, నేషనల్ హైవే అథారిటీ పీడీ తివారీ, ఎంవీఐ గంగాధర్, ట్రాఫిక్ పోలీసు, రవాణాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేక్ బృందం పరిశీలన

గుజరాతీపేట, జనవరి 23: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలను గురువారం నేక్ బృందం పరిశీలించారు. బెంగళూరుకు చెందిన నేక్ కమిటీ సభ్యులు కళాశాలలోని వివిధ విభాగాలను, మైదానాన్ని, భవనాలను పరిశీలించారు. కళాశాల అభివృద్ధికి మరిన్ని అదనపు భవనాలు కేటాయించాలని, ఆధునిక సదుపాయాలకు అవసరమైన నిధులు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ కమిటీ సభ్యులకు సూచించారు. ప్రిన్సిపాల్ పి.సురేఖ, అంబేడ్కర్ వర్సిటీ పూర్వపు వీసీ హనుమంతు లజపతిరాయ్, రిటైర్డు జడ్పీ సీఈవో సురంగి మోహనరావు, రిటైర్డు సెట్‌శ్రీ సీఈవో వీవీఎన్ మూర్తి, తంగి మురళీ పాల్గొన్నారు.

వాహనాలపై ప్రత్యేక డ్రైవ్

శ్రీకాకుళం క్రైం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువానం రాత్రి 9.30 గంటల సమయంలో వాహనాల తనిఖీపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నెంబర్లు ప్లేట్ లేని 41 వాహనాలను, అధిక శబ్దాలు కలిగించే వాహనాలను సీజ్ చేశారు. వీరందరిపై సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి

సోంపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీకే స్ట్రీట్‌లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని పేరెంట్స్ కమిటీ చైర్మన్ తెల్లి హరిబాబు కోరారు. అప్‌గేడ్ చేయడం వల్ల ఎంతో మంది విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిద్దాం

అరసవల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో చేపట్టనున్న కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకిద్దామని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, న్యూడెమోక్రసీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్ సమీపంలోని మహాత్మా జ్యోతి బాపూలే పార్కు వద్ద గురువారం నిరసన చేపట్టారు. వామపక్ష నాయకులు కృష్ణమూర్తి, రామస్వామి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై షాపులు ఉంటే చర్యలు

రణస్థలం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి డివైడర్ల మధ్య, ట్రాఫిక్ సమస్య కలిగిస్తూ రోడ్డుకు ఇరువైపుల దుకాణాలు పెడితే చర్యలు తప్పవని జేఆర్ పురం సీఐ అవతారం హెచ్చరించారు. గురువారం జాతీయరహదారిపై ట్రాఫిక్ సమస్యను క్లియర్ చేశారు. కూరగాయలు, పండ్ల వ్యాపారులతో మాట్లాడి ట్రాఫిక్ సమస్య కలిగి నష్టాలను వివరించారు. ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని, ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి ఉన్నారు.

రాజ్యాంగ విలువలకు తిలోదకాలు

అరసవల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కేవీఎల్ఎస్ ఈశ్వరి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థినులకు రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ, దాని మూలాలను సమూలంగా మార్చాలని ప్రయత్నిస్తోందన్నారు. కొత్తపల్లి రాంప్రసాద్, చోడవరం చంద్రశేఖర్, లీలావతి, సూర్యబేగం తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపరాదు

సోంపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడపరాదని బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు కోరారు. బారువ హైస్కూల్‌లో విద్యార్థులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాలు నడపడంపై వివరించారు.

వన్‌స్టాఫ్ సెంటర్లపై అవగాహన

గార, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలని రక్షిద్దాం.. ఆడపిల్లలను చదువనిద్దాం అనే నినాదంతో గురువారం గారలో వన్‌స్టాఫ్ సెంటర్లపై అవగాహన కల్పించారు. గృహ హింస.. బాల్య వివాహాలు.. మానవ అక్రమ రవాణా, వరకట్నం వేధింపులు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీ మందిరంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నక్క శంకరరావు, మురళి, వేణుగోపాల్, బరాటం లక్ష్మణరావు, జామి భీమశంకర్, నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, విద్యా సంస్థలో సుభాష్ చంద్రబోష్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు పనులు ప్రారంభం

సరుబుజ్జిలి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలికిపెంట పంచాయతీ ఎల్‌పీఎం అగ్రహారంలో గురువారం ఎమ్మెల్యే కూన రవికుమార్ బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. సరుబుజ్జిలి, ఎల్ఎన్ పేట మండలాలను కలుపుతూ ఉన్న అగ్రహారం-దబ్బపాడు బీటీ రహదారితో ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. తొలుత సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, టీడీపీ నాయకులు అంబళ్ల రాంబాబు, వెలమల రమేష్, చిన్నాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీల లెక్కింపు

అరసవల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణస్వామి వారి హుండీలను శుక్రవారం ఉదయం 8.00 గంటల నుంచి ఆలయ అనివెట్టి మండపంలో లెక్కించనున్నట్టు ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో ఈ లెక్కింపు చేపట్టనున్నట్టు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగుల పనితీరు మారాలి

ఆమదాలవలస, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని వివిధశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరు మారాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషన్ పి.బాలాజీ ప్రసాద్‌తో కలిసి ఆయన వివిధ శాఖలపై సమీక్షించారు. గృహ నిర్మాణ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలని పలుమార్లు ఆదేశించినా పట్టించుకోకపోవడంపై ఆ శాఖ సిబ్బందిని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వం కేవలం 70 వేల గృహ నిర్మాణాన్ని పూర్తి చేయించిందని, ప్రస్తుతం 17.30 లక్షల ఇళ్లు మంజూరు చేయడానికి సిద్ధంగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయకపోతే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు బోర గోవిందరావు, మురళీధరరావు, గురయ్య, మురళీయాదవ్ పాల్గొన్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

ఇచ్ఛాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సవరణ బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలపై బడ్జెట్ సమావేశం జరుగనుంది. ఈ సమావేశానికి అధికారులు, కౌన్సిల్ సభ్యులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న గీతాలాపన

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): చిత్రకారుల సంఘం ప్రతినిధి చోడవరం ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించిన జేసుదాసు సినీ గీతాలాపన ఆకట్టుకుంది. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించడంపై ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందంచారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో సమావేశం

కంచిలి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమేష్ రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు సూచనలు చేసి వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ కూర్మారావు, డీలర్ల సంఘ నాయకులు నాగరాజు, ప్రసాద్, రిషి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు అన్నారు. స్థానికి ఆంధ్రా ఆర్గానిక్స్ (ఏవోఎల్) పరిశ్రమల్లో గురువారం అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమ జీఎం కృష్ణయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి మోహన్‌రావు, రణస్థలం అగ్నిమాపక అధికారి అశోక్, ప్లాంట్ హెడ్ జీవీ నాగేశ్వరరావు, ఎస్‌డీఆర్ఎఫ్ రామకృష్ణ, ఎన్‌డీఆర్ఎఫ్ ఆదిరెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

కవిటి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండని తహసీల్దార్ బి.మురళీమోహనరావు కోరారు. వీఆర్వోలు, సర్వేయర్లతో గురువారం తన కార్యాలయంలో సమీక్షించారు. మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో 1036 భూ సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా దరఖాస్తులను గ్రామస్థాయిలో పరిశీంచి సమస్యను పరిష్కంచాలన్నారు. సమావేశంలో డీటీ కృష్ణమూర్తి, సర్వేయర్ మల్లికార్జున పాణిగ్రాహి, ఆర్ఐ రమణమూర్తి ఉన్నారు.

రోడ్లపై పార్కింగ్.. రాకపోకలకు బేజారు


కవిటిలోని చింతామణి ఆలయం రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

● కవిటిలో జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య

కవిటి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కవిటిలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు జటిలమవుతోంది. ప్రధానంగా బజారు తదితర వీధుల్లో నిత్యం భారీవాహనాలు, ఆటోలు ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వారు రోడ్లపై పార్కింగ్ చేస్తుండడంతో వెనుక నుంచి వచ్చిపోయే వాహనాలు తప్పుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కవిటి- సోంపేట- ఈదుపురం రోడ్డు రెండు వరుసల రహదారిగా మారిన తర్వాత బస్టాండు నుంచి బజారువీధి వరకు రద్దీ పెరిగింది. ఇక్కడ ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ వాహనాల రద్దీ వల్ల వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా కవిటిలోని పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే, ప్రారంభమయ్యే సమయంలో ఒకేసారి విద్యార్థులు రావడంతో ట్రాఫిక్‌పై ప్రభావం పడుతోంది. బస్టాండ్ నుంచి బజారువీధికి వెళ్లే మలుపులో కొందరు రోడ్డుపైనే సామగ్రి విక్రయిస్తున్నారు. విస్తరణ చేసిన తర్వాత రోడ్లపైనే వాహనాలు కొందరు పార్కింగ్‌చేస్తుండగా, యజమానులను పంచాయతీ అధికారులు హెచ్చరిస్తున్నా బేఖాతర్ చేస్తున్నారు. కవిటి చింతామణి అమ్మవారి ఆలయంతోపాటు తీరప్రాంత గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డులో ఆక్రమణల పుణ్యమాని వాహనాలు తప్పించుకోలేని పరిస్థితి నెలకొంది. ఈమార్గంలోనే మండలానికి సంబంధించిన కార్యాలయాలన్నీ ఉండడంతో ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. కాగా కవిటి బస్టాండ్ నుంచి చింతామణి ఆలయం వరకు వెళ్లే రహదారిని మెరుగుపరచి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని అధికారులను కోరామని ఉషోదయ యూత్ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ తెలిపారు. చింతామణి అమ్మవారి ఆలయం రోడ్డును విస్తరిస్తేనే ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని కవిటిమాజీ సర్పంచ్ ఎ.మధు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

వేర్వేరు ఘటనల్లో గురువారం జిల్లాకు చెందిన నలుగురు మృతిచెందారు. బావిలో పడి, రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తులు, చికిత్సపొందుతూ మరో వ్యక్తి మృతిచెందాడు. విజయనగరం జిల్లా నాతవలస వద్ద బహిర్భూమికి రోడ్డుదాటుతుండగా లారీ ఢీకొని ఓ వ్యక్తి మృత్యువుపాలయ్యాడు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

బావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి..

బూర్జ,జనవరి 23(ఆంధ్రజ్యోతి): మానాపురం గ్రామ శివారులోని తాగునీటి బావిలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్టు ఎస్ఐ ఎం.ప్రవల్లిక తెలిపారు. ఎస్ఐ, స్థానికుల కథనం మేరకు.. మృతిచెందిన వ్యక్తి మతిస్థిమితం లేకుండా సంచరించేవాడు. ఈక్రమంలో బావిలో పడి మరణించి ఉండొచ్చు. వీఆర్వో లక్ష్మీనారాయణకు అందించిన సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బంది సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు.ఈమేరకు కేసు నమోదు చేశారు.

పూండి- పలాస రైల్వే ట్రాక్‌పై..

వజ్రపుకొత్తూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పూండి-పలాస రైల్వేట్రాక్‌పై గురువారం రాత్రి గుర్తుతెలియని మృతదేహం గుర్తించామని పలాస జీఆర్పీ హెచ్‌సీ ఎం.మల్లేశ్వరరావు తెలిపారు. హెచ్‌సీ కథనం మేరకు.. 55 నుంచి 60 ఏళ్ల వయస్సుగల వ్యక్తిరైలు ప్రమాదంలో మృతి చెందిఉండొచ్చు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్సపొందుతూ ఒకరు..

సోంపేట,జనవరి 23(ఆంధ్రజ్యోతి):కంచిలి మండలంలోని జలంత్రకోట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం గాయపడిన ఓ వ్యక్తి గురువారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ప్రమాదంలో బారువ గ్రామానికి చెందిన హరీష్ కుమార్ పాణిగ్రాహి అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన అనిల్‌కుమార్ పాణిగ్రాహిని శ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. అయితే గురువారం చికిత్సపొందుతూ మృతిచెందాడు.

రోడ్డు దాటుతుండగా..

నరసన్నపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాపల్లి గ్రామానికి చెందిన జి.రాంబాబు (30) విజయనగరం జిల్లా నాతవలస టోల్ ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు ఓ వ్యాన్‌కు క్లీనర్‌గా బుధవారం ఉదయం రాంబాబు విశాఖ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాతవలస టోల్‌గేట్ వద్ద వ్యాన్ దిగి బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డు దాటే సమయంలో గుర్తుతెలియని లారీఢీకొంది. దీంతో అక్కడక్కడే మృతిచెందాడు.రాంబాబుకు రెండేళ్ల కుమారుడు, భార్య మహాలక్ష్మి ఉన్నారు.

తిరుమలలో పలాస వాసి మృతి

తిరుమల, జనవరి23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం పలాసకు చెందిన ఓ భక్తురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పలాసకు చెందిన రేణుక(51) కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి తిరుమలకు వచ్చారు. పాంచజన్యం విశ్రాంతి గృహంలో గదిని అద్దెకు తీసుకున్నారు. రాత్రి 8.30 గంటలకు ఆమెతో వచ్చిన వారందరూ బయటకు వెళ్లారు. రేణుక గదిలోనే ఉండిపోయారు. స్నేహితులు తిరిగి వచ్చాక గది తలుపులు ఎంత కొట్టినా తీయకపోవడంతో విశ్రాంతి భవనం అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు, విజిలెన్స్ అధికారులు తలుపులు పగలకొట్టి చూడగా రేణుక మంచంపై అచేతనంగా పడి ఉన్నారు. వెంటనే అశ్విని ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమె మృతిపై ఎలాంటి స్పష్టత రాలేదు. వేడినీటి గ్లాస్ చేతిలో ఉండటం, బెడ్‌పై పడిఉండటంతో గుండెపోటుతో చనిపోయారా? లేద విద్యుదాఘాతానికి గురయ్యారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

పలాస,జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొని పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోగల మొగిలిపాడుకు చెందిన రెల్ల వసంతులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..గొప్పిలి నుంచి పలాస వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న వసంతులను ఢీకొంది. ద్విచక్రవాహనం బస్సు కింద ఇరుక్కోవడంతో వసంతులు ఎడమకాలు తొడల నుంచి వేరైంది. కుడికాలు, తలకు బలమైన గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి 108 సిబ్బందిచేరుకొని క్షతగాత్రుణ్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కాశీబుగ్గ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేశారు.

కోవిలాం కాలనీ సమీపంలో..

ఎల్.ఎన్.పేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుపై కోవిలాంకాలనీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పెద్దకోటకు చెందిన డి.దుర్గారావు ద్విచక్రవాహనంపై సరుబుజ్జిలి వైపు నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు.అదే సమయంలో కొత్తూరు నుంచి నరసన్నపేట వెళ్తున్నకారు ఢీకొనడంతో ద్విచక్రవాహనం దెబ్బతినగా, కారుముందు భాగం నుజ్జునుజ్జయ్యింది.ఈమేరకు దుర్గారావుకు గాయాలయ్యాయి.కాగా ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని సరుబుజ్జిలి ఎస్ఐ బి. హైమావతి తెలిపారు.

59 మద్యం సీసాలు స్వాధీనం

నరసన్నపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యవరం జంక్షన్ సమీపంలో సర్వీసు రోడ్డులో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో గురువారం ఓ షాపులో పోలీసులు తనిఖీచేశారు.ఈమేరకు 59 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న బోటు తవిటియ్యను అరెస్టు చేసినట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పొందూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): లోలుగు కాలనీలో బుధవారం రాత్రి పేకాటాడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. సమాచారం మేరకు సిబ్బందితో ఎస్ఐ వి.సత్యనారాయణ, టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడి చేశారు. వీరి నుంచి ఎనిమిది ద్విచక్రవాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు, రూ.10,080 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

శాలిహుండంలో బంగారు ఆభరణాల చోరీ

గార, జనవరి 23(ఆంధ్రజ్యోతి): శాలిహుండం ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కాలనీకి చెందిన రమణమ్మ తన భర్తతో కలిసి సింగుపురం జంక్షన్ వద్ద పండ్ల దుకాణం నడుపుతూ జీవిస్తోంది. బుధవారం ఉదయం ఎప్పటిలాగే ఇంటికి తాళం వేసి పండ్ల వ్యాపారం కోసం వెళ్లింది. తిరిగి రాత్రి వచ్చి చూసేసరికి పెరటి తలుపులు తీసి ఉండడాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్లి బీరువా తలుపులు తీసి చూడగా.. అందులోని 14.50 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో గురువారం ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఘటనా స్థలాన్ని సీఐ పైడపునాయుడు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

నరసన్నపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం. లావణ్య కోరారు. గురువారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవ పక్షోత్సవాల్లో భాగంగా డిగ్రీ స్థాయిలో విద్యార్థులకు డిబేటింగ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు.

ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నందిగాం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డీటీ ఆర్.రామారావు కోరారు. గురువారం నందిగాం ఎంపీడీవో కార్యాలయంలో బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బూత్‌లెవల్‌లో ఓటరు అవగాహన నిమిత్తం ముగ్గుల పోటీలు, క్విజ్ పోటీలునిర్వహించాలని కోరారు.

చంద్రబాబు అడుగుజాడల్లో లోకేశ్

● జిల్లాలో జన్మదిన వేడుకలు నిర్వహించిన టీడీపీ శ్రేణులు

సీఎం చంద్రబాబునాయుడు అడుగుజాడల్లో నడుస్తూ యువగళంతో పార్టీ శ్రేణుల్లో ఉత్తేజం నింపి గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కృషిచేశారని టీడీపీ ప్రజాప్రతినిధులు కొనియాడారు. గురువారం జిల్లాలో లోకేశ్ జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి.

● నరసన్నపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట టీడీపీ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదినం పురస్కరించుకుని కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కేక్ కట్ చేశారు.

●పలాస/రూరల్, జనవరి23(ఆంధ్రజ్యోతి): పలాసలో ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం పలాస మండలంలోని లొద్దభద్ర రామలింగేశ్వరాలయం, పెదంచల శివాలయం, పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో రాజమ్మకాలనీ కాశీవిశ్వేశ్వరాలయం, కాశీబుగ్గ పెద్దబ్రాహ్మణవీధి బృందావన చంద్రాలయం, పురుషోత్తపురం నీలకంఠేశ్వరాలయాలు, మందస, పితాతోళిలోని ఆలయాల నిర్వాహకులకు మైక్‌సెట్లను ఎమ్మెల్యే అందజేశారు. పలాస టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు,కుత్తుమ లక్ష్మణకుమార్, లొడగల కామేశ్వరరావు, నవీన్, ధనుంజయ, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

●పాతపట్నం జనవరి23(ఆంధ్రజ్యోతి):పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేశారు. అనంతరం నీలమణిదుర్గ ఆలయం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి, ఆలయంలో లోకేశ్‌పేరిట 1001 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలునాటారు.వృద్ధులకు దుప్పట్లు పంపిణీచేశారు. సీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి పాతపట్నం, మెళియాపుట్టి,హిరమండలం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట మండలాలకార్యకర్తలు పాల్గొన్నారు.

●ఆమదాలవలస, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రక్తదానం మరొకరికి ప్రాణదానంగా నిలుస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పట్టణంలో పార్టీ శ్రేణులు రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతసాగర్ పాల్గొన్నారు.

● కవిటి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కవిటిలోని చింతామణి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీశ్రేణులతో కలసి కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు బి.రమేష్, ఎ.మధు పాల్గొన్నారు.

●రణస్థలం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

●ఎచ్చెర్ల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు పాల్గొన్నారు.

యువతకు నేతాజీ ఆదర్శం


సంతబొమ్మాళి: బోరుభద్ర ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

● జిల్లావ్యాప్తంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శ ప్రాయుడని వక్తలు కొనియాడారు. గురువారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో నేతాజీ జయంతి పురస్కరించుకుని విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమాల్లో దేశానికి ఆయన చేసిన సేవలను వక్తలు గుర్తుచేశారు. **(ఆంధ్రజ్యోతి బృందం)**

నీటిఎద్దడి నివారణకు చర్యలు: ఎమ్మెల్యే శిరీష


వజ్రపుకొత్తూరు: పల్లిసారథిలో పశువైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న శిరీష

పలాస, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో వేసవిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. గురువారం మునిసిపాలిటీలోని 11, 13, 19, 22, 29 వార్డుల్లో రూ.30 లక్షలతో నిర్మించనున్న పవర్‌బోర్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు, చైర్మన్ బళ్ల గిరిబాబు, ఏపీటీసీపీ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, జోగ మల్లి, టంకాల రవిశంకర్‌గుప్తా పాల్గొన్నారు.

●హరిపురం, జనవరి23 (ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని మధ్యూరు గ్రామానికి చెందిన బుడుకు శంకర్ హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 2,52,202ల చెక్కును ఎమ్మెల్యే గౌతు శిరీష అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొర్ల కన్నారావు, జీకే నాయుడు, అగ్గున్న జయరాజు, లబ్బ రుద్రయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

●వజ్రపుకొత్తూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పల్లిసారథిలో నిర్వహించిన పశువైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా పశుసంవర్థక శాఖ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీ రవికృష్ణ,టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు సూరాడ మోహనరావు, ఎ.ఉమామహేశ్వ రరావు, బి.శశిభూషన్, షణ్ముఖరావు, వైద్యులు మెట్టపాపారావు, యు.తిరుపతి, యాయాతి పాల్గొన్నారు. కాగాకొత్తపేటలోని యూపీ పాఠశాలను ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని టీడీపీ బీసీసెల్ అధ్యక్షులు గోవిందపాపారావు కోరారు.ఈ మేరకు ఎమ్మెల్యే గౌతుశిరీషకు కొత్తపేట నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు.

కూటమితోనే గ్రామాల్లో అభివృద్ధి: ఎమ్మెల్యే బగ్గు


నరసన్నపేట: బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/జలుమూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి జవసత్వాలు వచ్చాయని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం నరసన్నపేట, జలుమూరు మండలాల్లో పారశెల్లి, అల్లాడ వద్ద రూ.3.25 కోట్లతో పారశెల్లి- రెల్లివలస- అల్లాడ వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వంలో రోడ్డు కల నేరవేరిందని రెల్లివలస, పారశెల్లి గ్రామస్థులు డబ్బీరు కిరణ్, బైరి రామారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, టీడీపీ మండలాధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, వెలమల రాజేంద్రనాయుడు, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మెండ రాంబాబు, బగ్గు గోవిందరావు, హనుమంతు రంగనాధం, కింజరాపు సత్యం, దుద్దు నారాయణరావు, రాజేశ్వరరావు,డబ్బీరు కిషోర్,గంగు చలపతిరావు, ఆర్అండ్‌బీడీఈఈ సత్యనారాయణ, ఏఈ శ్రీనివాసరావు, ఏపీవో యుగంధర్ పాల్గొన్నారు.

●పోలాకి, జనవరి 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని సీపీ రోడ్డు నుంచిరాళ్లపాడు వరకూ రూ.50లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ముద్దాడ బైరాగినాయుడు టీడీపీ నాయకులు గొండురామన్న, బైరిబాస్కరరావు, ఎంవీనాయుడు, చిట్టిసింహాచలం, బోరసోమేశ్వరరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు పూర్తిచేస్తాం

● ఏపీఎంఐడీసీ ఎస్ఈ విజయభాస్కరరావు

నరసన్నపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రాజాం, సీతంపేట, నరసన్నపేటలోని ఆసుపత్రి భవన నిర్మాణాలు మార్చి నాటికి పూర్తి చేస్తామని ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎస్ఈ (ఏపీఎంఐడీసీ) విజయభాస్కరరావు తెలిపారు.గురువారం నరసన్నపేటలోని వందపడకల ఆసుపత్రి భవనంలో రూ.12.6 కోట్ల నాబార్డు నిధులతో చేపడుతున్న భవనం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మూడేళ్లుగా భవనం పనులు సాగుతుండడంపై ఆరాతీశారు. నరసన్నపేట ఆసుపత్రి ఆవరణలో డ్రైనేజీ, ప్రహరీ, అంతర్గత రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఐడీసీ ఈఈ సత్యప్రభాకర్, డీఈఈ శిమ్మన్న, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు, రమణమూర్తి పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

జలుమూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు రాజ్యాంగ ఉల్లంఘనే అని నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ ఆరోపించారు.రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని తెలిపారు. చల్లవానిపేట పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేసి అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భేరి వెంకటరమణ పాల్గొన్నారు.

సరియాపల్లిలో పశువైద్య శిబిరం

కోటబొమ్మాళి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరియాపల్లి, వాంద్రాడల్లో పశువైద్యాధికారులు లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞచైతన్య ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, పశువైద్యసిబ్బంది, గ్రామపెద్దలు వెలమల కామేశ్వరరావు, చల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

పోర్టు నిర్వాసితులను ఆదుకుంటాం: ఆర్డీవో


విష్ణుచక్రం గ్రామస్థులతో మాట్లాడుతున్న కృష్ణమూర్తి


టెక్కలి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టుకు భూములిచ్చి సహకరించిన నిర్వాసితులకు ఆదుకుంటామని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తెలిపారు. గురువారం టెక్కలి సబ్ కలెక్టరేట్‌లో విష్ణుచక్రం గ్రామస్థులతో మాట్లాడారు. తమకు ఆర్అండ్ ఆర్ కాలనీ నిర్మించాలని, లేదా అదనంగా రూ.నాలుగు లక్షలు చొప్పున్న కేటాయించాలని, అర్హులైన వారికి పీడీఎఫ్ ఇవ్వాలని, గ్రామం పరిధిలోని చెట్లను గుర్తించి వాటికి డబ్బులు కేటాయించాలని, ఆర్అండ్ఆర్ కాలనీకి కేటాయించిన స్థలం ఎత్తుచేయాలని గ్రామస్థులు కోరారు.పోర్టు యంత్రాంగం గ్రామం చుట్టూ మట్టి దిబ్బలు వేస్తుండడంతో ఇబ్బంది పడుతున్నామని ఆర్డీవోకు తెలియజేశారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ కాలనీలో మార్చి నెలాఖరు నాటికి రోడ్లు, డ్రైయిన్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పిస్తామని, టెక్కలి ప్రాంతం నుంచి తాగునీరందిస్తామని తెలిపారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీలు

జలుమూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరవంజ మోడల్ స్కూల్, జలుమూరు కేజీబీవీలో ఉపాధిహామీ బృందం సభ్యులు గురువారం సామాజిక తనిఖీలు నిర్వహించారు.ఉపాధి పనుల సామాజిక తనిఖీలో భాగంగా పాఠశాలలు నిర్వహణ, విద్యార్థులకు వసతులు, విద్యా కానుక, తదితర రాయితీలు సరిగ్గా అందాయా లేదా అనే దానిపై తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఆర్పీ పున్నెపునాయుడు తెలిపారు.రికార్డులు పరిశీలించి పాఠశాల అభివృద్ధికి ఇస్తున్న నిధుల వినియోగంపై పరిశీలించినట్లు చెప్పారు. సమగ్ర నివేదికను జిల్లా అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గణేష్‌పట్నాయక్, కేజీబీవీపాఠశాల ప్రత్యేకాధికారి యశోద పాల్గొన్నారు.

● పోలాకి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈదులవలస మోడల్‌స్కూల్‌లో నాడు-నేడు పనులపై సోషల్‌ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు-నేడు పనుల రికార్డులను ఆడిట్ బృందసభ్యులు పరిశీలించి, ప్రిన్సిపాల్ పైడి ప్రవీణతో మాట్లాడారు.ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆడిట్ బృందసభ్యులు, ఎస్ఆర్పీ పి.రామారావు, డీఆర్పీలు, కె.సత్తిబాబు, కె.రాజు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీలు ఉపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్, ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

●హిరమండలం, జనవరి23 (ఆంధ్రజ్యోతి):హిరమండలం కేజీబీవీ, సుభలయ ప్రాథమికోన్నత పాఠశాలలో సోషల్ ఆడిట్ బృందం రికార్డులు, తనిఖీ నిర్వహించింది.విద్యార్థులతోపాటు తల్లిదండ్రుల నుంచి పాఠశాల నిర్వహణపై అడిగి తెలుసుకుంది.కార్యక్రమంలో ఎస్ఆర్పీ జగన్, ప్రత్యేకాధికారి కృష్ణవేణి పాల్గొన్నారు.


పోలాకి: ఆదర్శ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

జేఈఈ మెయిన్స్‌కు 587 మంది హాజరు

నరసన్నపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీలో గురువారం రెండోరోజు జేఈఈ మెయిన్స్ పరీక్షలు రెండు షిఫ్టుల్లో జరిగాయి. 596 మంది అభ్యర్థులకు 587 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం సెషన్స్‌లో నలుగురు, మధ్యాహ్నం ఐదుగురు అభ్యర్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులు తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రం వద్దకు రెండు గంటలు ముందు చేరుకోవడంతో పరీక్ష కేంద్రం పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

నందిగాం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రుణాలు పొందినటువంటి రైతులు రెన్యువల్ చేసుకోవాలని దిమిలాడ పీఏసీఎస్ సీఈవో పి.శ్రీనుబాబు తెలిపారు. గురువారం దిమిలాడ విలేకరులతో మాట్లాడుతూ రుణాలను రెన్యువల్ చేసుకోవడం వల్ల రానున్న ఖరీఫ్‌లో ప్రభుత్వం కల్పించే రాయితీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. 1బీ, ఆధార్, పాన్, బ్యాంకుఖాతా జిరాక్స్‌లతో పాటు పాస్‌పోటో, ఏడు శాతం వడ్డీ డబ్బులు పీఏసీఎస్‌కు తీసుకువచ్చి కట్టాలని సూచించారు.

●కోటబొమ్మాళి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి పీఏసీఎస్‌లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28లోగా ఏడు శాతం వడ్డీతో రెన్యువల్ చేసుకోవాలని సీఈవో మెండ సత్యనారాయణ తెలిపారు. లేకపోతే 13శాతం అపరాధ వడ్డీతో రుణం మొత్తం చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

వజ్రపుకొత్తూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు పిలుపునిచ్చారు. గురువారం గరుడభద్రలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ బి.నిహార్ గ్రామస్థులతో మాట్లాడారు. అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

కాశీబుగ్గ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. గురువారం కాశీబుగ్గ జడ్పీ ఉన్నతపాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎల్పీచలం అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సైన్స్‌ప్రయోగశాల వినూత్న పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణంపై పలాసలో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరావు, సభ్యులు మోహన్‌రావు, చిట్టిబాబు, కోదండరావు, గోపాల్, ధర్మారావు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

కాశీబుగ్గ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు తెలిపారు. గురువారం కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో మునిసిపల్ సాధారణ నిధులతో కవర్ శ్లాబ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలోకమిషనర్ రామారావు, డీఈ కనకరాజు, ఏఈ కిరణ్‌కుమార్, చంద్రశేఖర్ త్యాడి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు స్థల పరిశీలన

నరసన్నపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జమ్ము పంచాయతీ పరిధిలో గల పొన్నానపేట గ్రామానికి రోడ్డు వేసేందుకు మార్గం సుగమమయ్యిందని తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం పొన్నానపేట రోడ్డు వేసేందుకు స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల గ్రామానికి రోడ్డు వేసేందుకు పనులు చేపట్టగా కొందరు తమ భూముల్లో రోడ్డు వేయడంపై అభ్యంతరం తెలిపారు. దీంతో సంఘటన ప్రాంతానికి వెళ్లిన రెవెన్యూ అధికారులు బాధితులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులకు మరో ప్రాంతంలో ఇళ్లస్థలాలు అందజేయడానికి కలెక్టర్‌కు ప్రతిపాదన చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

బియ్యం పంపిణీ

పోలాకి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లివలసలో ఇటీవల విద్యుదాఘాతంతో ఇల్లు కాలిపోవడంతో బాధిత కుటుంబానికి తహసీల్దార్ ఎం.సురేషకుమార్, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో బియ్యం పంపిణీచేశారు. రూ.25 వేల నగదుతోపాటు వంటసామగ్రి, దుస్తులు, గ్యాస్‌సిలిండర్ పేలిపోయిందని, విలువైన దస్త్రాలు కాలిపోయాయని వారు వివరించారు. ప్రభుత్వం తరపున కాలనీ మంజూరుచేయించాలని బాధితురాలు నక్క బుచ్చి కోరింది.